

ప్రవచనాలతో సిద్దిపేట పునీతం

చాగంటి కోటేశ్వరరావు మూడు రోజుల పాటు ఇచ్చిన ప్రవచనాలతో సిద్దిపేట పునీతమైందని మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు.

వివరాలు 8లో ▸



సైబర్ వలలో ఉద్యోగులు

పార్ట్ టైం జాబ్ అంటూ వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి పటాన్‌చెరులో ఇద్దరు నగదు పోగొట్టుకున్నారు.

వివరాలు 8లో ▸

లడ్డూ @రూ.10.08 లక్షలు

పటాన్‌చెరు టౌన్: గణేశుడి లడ్డూను రూ.10.08 లక్షలకు రామేశ్వరంబండ సర్పంచ్ ధరణి అంతిరెడ్డి దక్కించుకున్నారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని రామేశ్వరంబండ వీకర్ సెక్షన్ కాలనీలో ఉత్సవ కమిటీ వారు వేలంవేయగా పై ధరకు సొంతం చేసుకున్నారు. ముందుగా ప్రతిమను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం గావించారు.



వెంకటశివయ్య, మేనేజరు, నారాయణ ఖేడ్ మున్సిపాలిటీ

సాక్షి ఫోన్ ఇన్

తేదీ: 03-10-2023
సమయం: ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు
అంశం: పారిశుద్ధ్య సమస్య - పరిష్కారం
కాల్ చేయాల్సిన నంబర్లు: 9494419861, 9949309592



మల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్, జహీరాబాద్

సాక్షి ఫోన్ ఇన్

తేదీ: 03-10-2023
సమయం: ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు
అంశం: పారిశుద్ధ్య సమస్య - పరిష్కారం
కాల్ చేయాల్సిన నంబరు: 9849905919



శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, సదాశివపేట

సాక్షి ఫోన్ ఇన్

తేదీ: 03-10-2023
సమయం: ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు
అంశం: పారిశుద్ధ్య సమస్య- పరిష్కారం
కాల్ చేయాల్సిన నంబరు: 98499 05918

బాపూజీ మార్గం.. అనుసరణీయం

మహాత్మాగాంధీ ఆశయాలను, ఆదర్శాలను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ, కలెక్టర్ శరత్ అన్నారు. సోమవారం మహాత్ముని జయంతిని పురస్కరించుకుని జిల్లా ప్రజా పరిషత్ ఆవరణలో గల ఆయన విగ్రహానికి వారు, వైస్ చైర్మన్ ప్రభాకర్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్రం కోసం అహింస, శాంతియుత మార్గంలో పోరాడారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎల్లయ్య పాల్గొన్నారు. మహాత్ముడు చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని సత్ప్రవర్తనలో జీవించాలని ఎస్పీ రమణ కుమార్ అన్నారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా సంగారెడ్డి కేంద్ర కారాగారంలో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. గాంధీ చెప్పిన అహింసా మార్గాన్ని అనుసరించారని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి సూచించారు. అనంతరం నిర్వహించిన క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. - సంగారెడ్డి టౌన్



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, కలెక్టర్ శరత్



బహుమతులు అందజేస్తున్న న్యాయమూర్తి లక్ష్మణాచారి, ఎస్పీ రమణకుమార్

టికెట్లకు ముందే ఇక్కట్లు

- కాంగ్రెస్‌లో రాజుకుంటున్న అసమ్మతి సెగలు
- పలు చోట్ల పార్టీని వీడుతున్న ముఖ్యనేతలు
- ఇటీవల జహీరాబాద్‌లో.. ఇప్పుడు మెదక్‌లో..
- అభ్యర్థిత్వాల ప్రకటన తర్వాత మరింత పెరిగే అవకాశం



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్‌కు గట్టి ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఆయా నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించకముందే ముఖ్యనేతలు పార్టీని వీడుతుండటం కలకలం రేపుతోంది. పక్షం రోజుల క్రితం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో ముఖ్యనేతలంతా పార్టీని వీడారు. ఇప్పుడు మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి గుడ్‌బై చెప్పారు. జహీరాబాద్ టికెట్ ఆశించిన ఏర్పుల నరోత్తం నెల రోజుల క్రితమే వీడారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ సమక్షంలో ప్రగతిభవన్‌లో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. దీంతో హస్తానికి స్థానికంగా బలమైన నాయకుడు లేకపోవడంతో డాక్టర్ ఎ.చంద్రశేఖర్‌కు టికెట్ ఖరారు చేసే యోచనలో అధిష్టానం ఉంది. మరోవైపు ఇదే నియోజకవర్గానికి చెందిన డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి పార్టీని వీడారు. ఆయన ఢిల్లీలో బీజేపీ జాతీయ ముఖ్యనేతల సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఇటు సంగారెడ్డి నియోజకవర్గంలోనూ పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. మండల స్థాయి నాయకులూ ఇదే బాటపట్టారు. అందోల్ నియోజకవర్గాలోనూ క్షేత్ర స్థాయి నాయకులు వీడి ఇటీవల బీఆర్ఎస్‌లో చేరారు. ఇలా దాదాపు అన్ని చోట్ల కాంగ్రెస్ నుంచి వలసలు ఆ పార్టీని ఇబ్బందుల్లో పడేస్తోంది.

ముందే ఇలా..

ఇప్పటికే బీఆర్ఎస్ అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లాలో ఒక్క నర్సాపూర్ మినహా మిగతా అన్ని చోట్ల టికెట్లను ప్రకటించింది. కాంగ్రెస్ ఇంకా అభ్యర్థిత్వాలను ప్రకటించలేదు. ఒకవేళ అభ్యర్థిత్వాలు ప్రకటిస్తే ఆయా నియోజకవర్గాల్లో టికెట్ రాక భంగపడిన నేతలు మరికొంత మంది వీడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఒకట్రెండు నియోజకవర్గాలు మినహా అన్ని చోట్ల టికెట్‌ను ఇద్దరు, ముగ్గురు ఆశిస్తున్నారు. ఎవరికి వారే వ్యక్తిగతంగా ప్రయత్నాలు చేస్తున్నారు. సిద్దిపేట్ జిల్లా దుబ్బాక నియోజకవర్గానికి ముగ్గురు కాంగ్రెస్ నేతలు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అది దక్కని పక్షంలో ఒకరు పార్టీ మారే అవకాశాలున్నాయి.

బీఆర్ఎస్‌లోకి వలసలు

కాంగ్రెస్ అసంతృప్త నేతలకు బీఆర్ఎస్ గాలం వేస్తోంది. ఆ పార్టీని వీడుతున్న నేతలు కారెక్కుతున్నారు. పార్టీని వీడుతున్న వారిలో ఒకరిద్దరు మినహా మిగతా ముఖ్యనేతలంతా గులాబీ పార్టీలో చేరుతున్నారు. పార్టీ టికెట్ల ప్రకటనకు ముందే పరిస్థితి ఉంటే ప్రకటన తర్వాత అసమ్మతి భగ్గుమనడం ఖాయంగా కనిపిస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

రూ.20.46 కోట్లతో 160 షాపులు



మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజయ్‌తో కలిసి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

- మార్కెట్ యార్డులో దుకాణ సముదాయం
- జియాగూడ మీట్ మార్కెట్ ఇక్కడే
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: దేశంలోనే మొట్టమొదటిసారిగా 160 దుకాణాలతో వ్యవసాయ మార్కెట్ యార్డులో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈ యార్డును రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ. 20.46 కోట్ల అంచనాతో 160 దుకాణ సముదాయాల నిర్మాణ పనులకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజయ్ కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గంలో రైతులు, కొనుగోలుదారులు, వ్యాపారస్తుల సౌకర్యార్థం 2016లో సీఎం కేసీఆర్ సహకారంతో 14 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేశామని చేశారు. నాటి నుంచి దశలవారీగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళ్తున్నామని వెల్లడించారు. త్వరలో జియాగూడలో ఉన్న మీట్ మార్కెట్ సైతం పటాన్‌చెరుకు తరలిస్తామన్నారు. పెరుగుతున్న వ్యాపారాలకు అనుగుణంగా యార్డు పక్కనే ఉన్న 40 ఎకరాల రైల్వే స్థలం అందించాలని పార్లమెంట్ సభ్యులు కొత్త ప్రభాకర్‌రెడ్డి ద్వారా ఆ శాఖకు విన్నవించామని తెలిపారు. త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యేను యార్డు చైర్‌పర్సన్, డైరెక్టర్‌లు సన్మానించారు. కార్యక్రమంలో శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి, ఎంపీపీ సుష్మా శ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేశ్ పాల్గొన్నారు.

సార్.. ఆశీస్సులు నాకే..

ఎమ్మెల్యే బరిలో ఉంటా..
నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



పన్యాల గ్రామంలో గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే మదన్ రెడ్డి

హత్నూర (సంగారెడ్డి): ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులు తనకే ఉన్నాయని, మూడోసారి ఎమ్మెల్యే బరిలో ఉంటానని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. సోమవారం హత్నూర మండలం పన్యాల గ్రామంలో గాంధీ, దివంగత బీఆర్ఎస్ నేత అక్బర్ విగ్రహాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని, కార్యకర్తలెవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి. కానీ, నా ధ్యాసంతా అభివృద్ధిపైనే అని పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా నర్సాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం రూ.56 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గతంలో తండాల బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.60 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నియోజకవర్గంలో 14 చెక్ డ్యామ్‌లు నిర్మించినట్లు పేర్కొన్నారు. హత్నూర మండల కేంద్రంలో రూ.8 కోట్ల వ్యయంతో డివైడర్లు నిర్మిస్తామని, రెండు మూడు రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. పన్యాల గ్రామానికి రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి త్వరలోనే ప్రొసీడింగ్ కాపీ ఇస్తానన్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మన్సూర్ అలీ, ఎంపీపీలు నర్సింలు, కల్లూరు హరికష్ణ, జెడ్పీటీసీ ఆంజనేయులు, సర్పంచ్ శ్వేత, బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆశావర్కర్ల వినతి

తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని ఎమ్మెల్యే మదన్ రెడ్డికి ఆశా వర్కర్లు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించారు.

6,067 మంది.. సొంతింటి కల సాకారం

- రాజకీయ జోక్యం లేకుండా డబుల్ ఇళ్లు
- వాటిని అమ్మినా, కొన్నా జైలుకే
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



పంపిణీ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, వేదికపై ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దేశంలో ఎక్కడా లేనివిధంగా నిరుపేదలకు వంద శాతం సబ్సిడీపై ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా న్యాయబద్ధంగా లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందించామని పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు.. కేసీఆర్ నగర్‌లో 6,067 మందికి మూడో విడత డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. నిరుపేదలకు ముఖ్యమంత్రి కొల్లూరులో ఒక్కొక్కరికీ రూ.70 లక్షలు విలువైన ఇంటిని అందిస్తున్నారన్నారు. లబ్ధిదారులు వారి బస్తీలో వెళ్లి దరఖాస్తు చేసుకొని రాని వారికి ధైర్యం చెప్పాలని సూచించారు. త్వరలో మరోసారి అర్హులైన వారికి అందజేస్తామన్నారు. హైదరాబాద్‌లో అద్దె ఇంటిలో నివాసముండే ప్రతి పేదవాడి సొంతింటి కలను కేసీఆర్ నిజం చేసి తీరుతాడని వ్యాఖ్యానించారు. లబ్ధిదారులు ఇళ్లను అమ్మొద్దని సూచించారు. అమ్మిన వారు కొన్నవారు ఇద్దరూ జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.. స్థానికులకు 10 శాతం కాకుండా ఇంకాస్త పెంచి ఇళ్లు ఇవ్వాలని తన దృష్టికి తీసుకువచ్చారని వివరించారు. దానిని దృష్టిలో పెట్టుకొని త్వరలో సీఎంతో చర్చించి తీపి కబురు అందిస్తామని హామీనిచ్చారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పండగలను జరుపుకొంటున్నారని చెప్పారు. బతుకమ్మ పుట్టిందే తెలంగాణ పల్లెల్లో అని దానిని ప్రభుత్వం తొమ్మిది రోజులు ఘనంగా నిర్వహిస్తోందన్నారు. కుటుంబానికి పెద్ద కొడుకుగా కేసీఆర్ ..పేదలకు ఇళ్లు ఇవ్వడంతోపాటు వారి ఇంట్లో జరిగే ఆడపిల్ల పెళ్లికి మేనమామగా కళ్యాణలక్ష్మి కింద రూ.లక్ష అందిస్తున్నారని తెలిపారు. ఇక డబుల్ ఇళ్లు వచ్చిన ప్రతి ఒక్కరూ హైదరాబాద్‌లో సొంతిల్లు ఉందని ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఈ ధైర్యాన్నిచ్చిన బీఆర్ఎస్ అధినేతను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మాజీమంత్రి ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, కలెక్టర్ శరత్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, మున్సిపల్ చైర్ పర్సన్ లలితా సోమిరెడ్డి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గాంధీ విగ్రహం ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు చేస్తున్న సమ్మె సోమవారం 22వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని అమీన్‌పూర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడారు. సమ్మె చేస్తుంటే ప్రభుత్వం మొండి వైఖరిని అవలంబిస్తుండటం సరికాదన్నారు. యూనియన్‌తో చర్చలు జరిపి అన్ని సమస్యలు పరిష్కరించామని తప్పుడు ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. వెంటనే సర్కారు స్పందించి డిమాండ్లను నెరవేర్చాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కల్పన, సుజాత, శమాదేవి పాల్గొన్నారు.

వడియారంలో సినీ నటుడు వెంకట్ సందడి



నటుడు వెంకట్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారంలో సినీ నటుడు వెంకట్ సందడి చేశారు. దుబ్బాక వినాయక నిమజ్జన కార్యక్రమానికి వెళ్తూ మార్గమధ్యలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి గెస్ట్‌హౌస్‌కు వచ్చారు. అక్కడ స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయనను సన్మానించారు. చాలా రోజుల మళ్లీ సినిమాల్లో నటిస్తున్నానని వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రాధాన్యం

రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్



నవీన్ మిట్టల్ దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్ శరత్, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి దంపతులు

పటాన్‌చెరు టౌన్: హిందూ ధర్మ పరిరక్షణలో బ్రాహ్మణుల పాత్ర కీలకమని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ అన్నారు. సోమవారం పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ వేద శాస్త్ర ప్రవర్తక సభ చతుర్వేద సదస్సు, తెలంగాణ విద్వత్ పరీక్షల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. బ్రాహ్మణులకు ఏ దేశంలో లేని విధంగా ముఖ్యమంత్రి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. వేదాలను అవపోసన పట్టి, వాటి గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు తెలియ పరుస్తుండటం అభినందనీయమన్నారు. వారి సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అయితే 150 మంది వేద పాఠశాల విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణ సాధించగా సర్టిఫికెట్లు అందజేశారు. తొలుత నవీన్ హోమం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు ఇచ్చారు.

వేద పాఠశాల, వసతి గృహం నిర్మిస్తాం

బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అండగా ఉంటూ ధర్మ పరిరక్షకుడిగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని బీరంగూడ గుట్టపై అత్యాధునిక సౌకర్యాలు, దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేద పాఠశాలను నిర్మించడంతోపాటు వసతి గృహాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, తెలంగాణ వేద శాస్త్ర ప్రవర్తక సభ అధ్యక్షుడు రామ కృష్ణ శర్మ, బ్రాహ్మణ సమాజం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ శర్మ, గూడెం మధుసూదన్‌రెడ్డి, వేద బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో యువతి ఆత్మహత్య

బొల్లారంలో ఘటన

జిన్నారం(పటాన్‌చెరు): అక్కతో గొడవ పడి చెల్లెలు క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని బొల్లారం పీఎస్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. సీఐ నయిమోద్దీన్ కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన పూజ్య(18)తన అక్క, స్నేహితులతో కలిసి బొల్లారంలో నివాసం ఉంటున్నది. కాగా అక్క పున్నికి, తోటి స్నేహితుల మధ్య గొడవ జరిగింది. అందులో తన ప్రస్తావన తెచ్చారని మనస్తాపం చెందిన ఆమె రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని తోటి స్నేహితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్
- బీఆర్ఎస్‌లో చేరిన పలు పార్టీల నేతలు



పార్టీలో చేరిన నాయకులతో చింతా ప్రభాకర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రేజింతల్ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు వార్డు సభ్యులు, యువకులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చింతా మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే బీఆర్ఎస్‌కే ప్రజలు మరోసారి పట్టం కట్టాలన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేవన్నారు. రైతు సంక్షేమం కోసం సీఎం ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. తెలంగాణలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తొంట యాదమ్మ, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మారెడ్డి, నిర్మల రమేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజన్న, నాయకులు సుధీర్ రెడ్డి, సుధాకర్, నబీ, మక్సూద్, సాగర్, నర్సింలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగ శిక్షకులనే నియమించాలి


మంత్రి హరీశ్‌రావును కలిసిన కృపాకర్ తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ ఆయుష్ వెలెనెస్ సెంటర్‌లలో యోగ శిక్షకులనే నియమించాలని తెలంగాణ యోగ ఆర్గనైజేషన్ జేఏసీ కన్వీనర్ కృపాకర్ కోరారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని రాష్ట్రలలో నోటిఫికేషన్ ప్రకటించి యోగా శిక్షకులను నియమిస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో కూడా యోగా శిక్షకులను నియమించాలన్నారు. కార్యక్రమంలో యోగ జేఏసీ నాయకులు బ్రిజ్ భూషణ్, సత్యారెడ్డి, రవికుమార్, రజిత, యోగ శిక్షకులు పాల్గొన్నారు.

నాచగిరిలో అర్చకులకు రెండో రోజు శిక్షణ


అర్చకులకు ఆగమ విధానాలు వివరిస్తున్న శంకర్‌శర్మ

వర్గల్(గజ్వేల్): నాచారం గుట్ట నాచగిరి శ్రీలక్ష్మీ నరసింహ క్షేత్రంలో ధూప దీప నైవేద్యం అర్చకుల శిక్షణశిబిరం సోమవారం రెండో రోజుకు చేరింది. పాంచరాత్ర ఆగమం, గ్రామ దేవత ఆగమం విధి విధానాలపై ఆచార్యులు అవగాహన కల్పించారు. వివిధ అంశాలు అర్చకులకు అర్థమయ్యే విధంగా రావికోటి శంకర్ శర్మ, వట్టికోట కృష్ణమాచార్యులు, బెల్లంకొండ జగన్నాథచార్యులు, త్రిగుళ్ల గోపాలకృష్ణశర్మ, హరి ప్రసాదశర్మ, నాగబాల కామేశ్వరశర్మ వివరించారు. దేవదాయ ధర్మదాయశాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ శివరాజ్, నాచగిరి ఈవో అన్నపూర్ణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గణేష్ లడ్డూ దక్కించుకున్న ముస్లిం యువకుడు


డ్రాలో గెలుపొందిన లడ్డూతో బబ్లూ

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలో భజరంగ్ దళ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద లడ్డూకు డ్రా నిర్వహించారు. ఈ డ్రాలో సుమారుగా 600 మంది పాల్గొనగా ఏడో వార్డు కౌన్సిలర్ జుబేదా ఖతూన్ కుమారుడు బబ్లు భాయ్ లడ్డూ దక్కించుకున్నాడు. బబ్లూను మండప నిర్వాహకులు శాలువాతో సత్కరించిన లడ్డూ అందించారు.

కానిస్టేబుల్ పోస్ట్‌కు బైక్ మెకానిక్ కుమార్తె

అశ్రితకు పలువురి అభినందనలు


అశ్రితను అభినందిస్తున్న లోక్‌సత్తా, స్ఫూర్తి స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు

హుస్నాబాద్: కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికయిన ఆకుల అశ్రితను లోక్‌సత్తా, స్ఫూర్తి స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా కానిస్టేబుల్ పోస్ట్‌కుఅశ్రిత ఎంపికైంది. ఈ నెల 7న అస్సాంలో విధుల్లోకి చేరుతున్నట్లు అశ్రిత పేర్కొంది. పట్టణానికి చెందిన ఆకుల తిరుపతి, రాధ దంపతులకు ముగ్గురు ఆడ పిల్లలు. తిరుపతి బైక్ మెకానిక్, తల్లి రాధ ఓ షాపులో పనిచేస్తూ పిల్లలను చదివిస్తున్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారని చెప్పడానికి ఆశ్రిత నిదర్శనమని పలువురు ప్రశంసించారు. అశ్రిత ఖర్చుల నిమిత్తం లోక్‌సత్తా అధ్యక్షుడు మల్కిరెడ్డి మాధవి మోహన్‌రెడ్డి రూ.5వేలు ఇచ్చి సన్మానించారు.స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, సభ్యులు తిరుపతి తదితరులు ఉన్నారు.

మహిళ హత్య.. నిందితుల ఇంటికి నిప్పు

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్సీపూర్‌లో ఘటన

దుబ్బాకరూరల్: మహిళను హత్య చేసిన నిందితుల ఇంటిని గ్రామస్తులు నిప్పంటించారు. ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్సీపూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గతనెల 7వ తేదీన బైండ్ల బాలవ్వ(52) మృతి చెందగా.. అదే రోజు అంత్యక్రియలు నిర్వహించారు. ఇంట్లో రక్తం మరకలు గమనించిన కుమారులు అనుమానం వచ్చి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో సెప్టెంబర్ 17న పూడ్చిన శవాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిర్వహించారు. అదేరోజు రాత్రి అనుమానితులు మద్దెల నవీన్, అతని తల్లి చంద్రవ్వను పోలీసులు అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించారు. బాలవ్వను తామే హత్య చేసినట్లు వారు అంగీకరించారు. నిందితులను గత నెల19న రిమాండ్‌కు పంపారు. ఈ విషయం బయటకు పొక్కకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే.. బాలవ్వను నవీన్, అతని తల్లి చంద్రవ్వ హత్య చేశారని సోమవారం వెలుగులోకి రావడంతో ఆగ్రహించిన గ్రామస్తులు.. నిందితుల ఇంటిపై దాడి చేశారు. ఫర్నిచర్ ధ్వంసం చేసి నిప్పంటించి దహనం చేశారు. ఘటనా స్థలానికి ఏసీపీ సురేందర్‌రెడ్డి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. నిందితులు రిమాండ్‌లో ఉన్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

అత్యాచారం.. ఆపై హత్య?

కాగా, బాలవ్వపై నిందితుడు నవీన్ అత్యాచారం చేసి హత్య చేసినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలినట్లు తెలిసింది. ఈ విషయాన్ని విచారణలో నిందితులు అంగీకరించినట్లు సమాచారం. అయితే.. ఈ వ్యవహారాన్ని పోలీసులు గోప్యంగా ఉంచడంతో బాధిత కుటుంబం పోలీసులను నిలదీయడం.. చివరకు అసలు విషయం బయటకు తెలియడంతో గ్రామస్తులు ఆగ్రహావేశాలకు లోనయ్యారు. నిందితుల రిమాండ్ వ్యవహారం పోలీసులు ఎందుకు గోప్యంగా ఉంచారో అంతుపట్టడం లేదు.


ఇంట్లో దగ్ధమైన సామగ్రి


ఇంటిని పరిశీలిస్తున్న సీఐ కృష్ణ

ప్రవచనాలతో సిద్దిపేట పునీతం


హాజరైన ప్రజలు

- చాగంటి ఒక ఆధ్యాత్మిక ఉద్యమ కారుడు
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: చాగంటి కోటేశ్వరరావు మూడు రోజుల పాటు ఇచ్చిన ప్రవచనాలతో సిద్దిపేట గడ్డ పునీతమైందని, ఆధ్యాత్మిక విలువలకు సిద్దిపేట భవిష్యత్తులో నిలయంగా మారనుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో చాగంటి కోటేశ్వరరావు మూడో రోజు చేసిన ప్రవచనాలను మంత్రి హరీశ్‌రావు సుమారు రెండు గంటల పాటు ఆలకించారు. ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మూడు రోజుల పాటు చాగంటి ఇచ్చిన ప్రవచనాల భావం భావి తరాలకు అందించేలా ప్రయత్నిస్తామని చెప్పారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవలో సిద్దిపేట ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు. చాగంటి కోటేశ్వరరావుది మధుర స్వరం అని, తన ప్రవచనాల ద్వారా తలరాత మార్చుకునేలా చేస్తున్న దిశా నిర్దేశకుడని పేర్కొన్నారు. చాగంటి అంటే స్నేహాన్ని పెంపొందించుకునే వ్యక్తిత్వం అని, తన మాటలతో కోట్లాది ప్రజల మనస్సు గెలిచి ఇంటిపేరు సార్థకత చేసుకున్నట్టు పేర్కొన్నారు. ప్రవచనం చెప్పడానికి ఒక్క నయా పైసా తీసుకోని కోటేశ్వరరావు కోట్లాది ప్రజల ప్రేమ పొంది. నిజంగా కోటీశ్వరుడు అయ్యాడని కొనియాడారు. ఒక సామాజిక, ఆధ్యాత్మిక ఉద్యమకారుడుగా చాగంటిని మంత్రి అభివర్ణించారు. సీఎం కేసీఆర్ చాగంటి కి గొప్ప అభిమాని అని, అప్పుడప్పుడు చాగంటి ప్రవచనాలు వింటారని చెప్పారు. మళ్లీ అవకాశం ఉంటే సిద్దిపేటకు రావాలని మంత్రి కోరారు.

ప్రజల ఆనందం ఆయన కళ్లలో చూశా..

నియోజకవర్గ ప్రజలు ఆనందంగా, సంతోషంగా ఉండాలనే గొప్ప మనస్సు మంత్రి హరీశ్‌రావులో ఉందని, రంగనాయక సాగర్ నీటి రిజర్వాయర్ గురించి కరువు శాశ్వత సెలవు అంటూ వివరిస్తున్న సమయంలో ప్రజల సంతోషం తన కళ్లలో చూసినట్టు చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. అది ఒక సేవ చేయాలనే గుణం ఉన్న వారికి నిదర్శనమని పేర్కొన్నారు. మూడో రోజు మానవీయ విలువలు అంశంపై ఆయన ప్రవచనాలు చెప్పారు. మాట ఒక వజ్రం లాంటిదని, మనిషి విలువ మాటల్లో ఇట్టే తెలిసి పోతుందన్నారు. ఒక మంచి మాట కష్టాన్ని దూరంచేస్తే, అదే మాట ఇతరులకు కష్టం తెస్తుందని పేర్కొన్నారు. మాట్లాడే సమయంలో జాగ్రత్తగా మాట రావాలని సూచించారు. కొన్ని జీవులకు పలుకులు వస్తాయి కానీ బుద్ధి ఉండదని, అదే మనిషికి పలుకులు, బుద్ధి రెండూ ఉంటాయని చెప్పారు. పది మంది కోసం పడిన కష్టం, చేసిన దానం మనిషి వెంట పుణ్యంగా వస్తుందని, సిద్దిపేట అన్నదాతలకు నిలయంగా ఉందని కొనియాడారు. అందరినీ కలుపుకుని ప్రయాణం చేయడం మనిషి ఉన్నత విలువన్నారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు చాగంటి కోటేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు.


చాగంటి కోటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

రాష్ట్ర స్థాయిలో సత్తాచాటాలి

- దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు
- ఉత్సాహంగా ప్రారంభమైన జిల్లా స్థాయి క్రీడలు

దౌల్తాబాద్(దుబ్బాక): క్రీడాకారులు జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయిలో సత్తాచాటాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండల పరిధిలోని లింగరాజుపల్లి వద్ద ఎంజేపీ గురుకుల బాలుర పాఠశాలలో సోమవారం అండర్ 14 అండర్-19 బాలురులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్యారం, చెస్, టెన్నికైట్, రన్నింగ్ తదితర క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 15 పాఠశాలల నుంచి 400 మంది, ఏడు కళాశాలల నుంచి 170 మంది మొత్తం 570 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్‌సీవో ప్రభాకర్ హాజరై ప్రిన్సిపాల్ శోభరాణితో కలిసి జ్యోతి ప్రజ్వలనచేసి క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ. క్రీడలు మానసికోల్లాసంతో పాటు శరీరక దారుఢ్యానికి దోహదపడుతాయాన్నారు. మొదటిరోజు అథ్లెటిక్, షాట్‌పూట్, క్యారం, ఖోఖో తదితర క్రీడలు నిర్వహించినట్లు పీడీ వెంకట్‌రెడ్డి తెలిపారు. జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేతకనకరాజు, ఆయా పాఠశాల ప్రిన్సిపాల్స్, పీఈటీలు పాల్గొన్నారు.


కాగడా వెలిగిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు తదితరులు

సైబర్‌వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

- ఇన్వెస్టు, కమీషన్ల పేరుతో మోసం
- ముగ్గురి నుంచి సుమారు రూ.27 లక్షల స్వాహా

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రూ.13 లక్షల 20 వేలు, మరొకరు రూ. 6 లక్షలు 50 వేలు పోగొట్టుకోగా మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రూ.7 లక్షల 50 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని కృష్ణానగర్ బీరంగూడకు చెందిన ఓ ఉద్యోగికి గతనెల 18న పార్ట్‌టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్‌చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు పూర్తిచేయడం మొదలుపెట్టాడు. తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. అలా బాధితుడు మొత్తం రూ.13 లక్షల 20 వేలు ఇన్వెస్టు చేశాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమీషన్ నగదు చూపిస్తూ వచ్చారు. దీంతో ఆ ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందన లభించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు తెలుసుకుని సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా అమీన్‌పూర్ పరిధిలోని కృష్ణభగవాన్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సెప్టెంబర్ 18న జాబ్‌ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. ఆయన కూడా అదే తరహాలో మొత్తం రూ.6 లక్షల 50 వేలు ఇన్వెస్ట్ చేశాడు. అలాగే అదే కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి సెప్టెంబర్ 17న జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ రాగా ఆమె కూడా రూ.7 లక్షల 50 వేలు ఇన్వెస్ట్ చేసి మోసపోయినట్టు గుర్తించి సోమవారం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమీన్‌పూర్ పోలీసులు కూడా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.16 లక్షలు మాయం..

దౌల్తాబాద్(దుబ్బాక): సైబర్ నేరగాళ్ల ఫోన్ కాల్‌కు బలైన శేరిపల్లి బందారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రూ.1.16 లక్షలు పోగొట్టుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. దౌల్తాబాద్ మండలం శేరిపల్లి బందారం గ్రామానికి చెందిన పసుపునూరి చంద్రశేఖర్ మొబైల్ బిజినెస్ చేస్తుంటాడు. గత 30న కొత్తగా క్రెడిట్ కార్డును తీసుకున్నాడు. అదే రోజు మధ్యాహ్నం చంద్ర శేఖర్‌ఫోన్‌కు ఒక దుండగుడు ఫోన్ చేసి కార్డు యాక్టివేట్ చేస్తామని చెప్పి ఓటీపీలను చెప్పమని చెప్పారు. దీంతో చంద్రశేఖర్ ఓటీపీలను చెప్పడంతో మొత్తానికి రెండు క్రెడిట్ కార్డుల అకౌంట్‌ల నుంచి మొత్తం రూ.1.16 లక్షలు గుర్తు తెలియని వ్యక్తుల అకౌంట్లోకి వెళ్లి పోయాయి. దీంతో చంద్రశేఖర్ సోమవారం దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

వైషమ్యాలను సృష్టిస్తున్న యాజమాన్యాలు

టీఎస్ఈ ఎస్సీ.ఎస్టీ డబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంమోహన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ యాజమాన్యాలు వ్యవహరిస్తున్న తీరుపై 4న ఛలో మింట్ కంపౌండ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దానిని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంమోహన్ పిలుపునిచ్చారు. జిల్లా విద్యుత్ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. శ్యాంమోహన్ మాట్లాడుతూ విద్యుత్ యాజమాన్యాలు ఉద్యోగులు, ప్రభుత్వాల మధ్య వైషమ్యాన్ని సృష్టిస్తున్నాయన్నారు. మూడు సంవత్సరాలుగా ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్, కంపనీలు అనేక కొర్రీలు పెట్టి ఉద్యోగులతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ రూల్ 1996కు, భారత రాజ్యాంగ ఆర్టికల్స్ 16(4)ఎ, సుప్రీం కోర్టు తీర్పులకు విరుద్ధంగా ఉత్తర్వులు ఇచ్చి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థలు మెరిట్ ర్యాంకింగ్ విధానం పాటించాలని చెప్పడం సరికాదని దాని వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, ఈడబ్ల్యూఎస్ కమ్యూనిటీలకు చెందిన మహిళలకు నష్టం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో టీఎస్ఈఎస్సీఎస్టీడబ్ల్యూఏ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహ, సిద్దిపేట సర్కిల్ కార్యదర్శి కనకయ్య, అధ్యక్షుడు స్వామిదాస్, సిద్దిపేట డివిజన్ సెక్రటరీ లక్ష్మణ్, ఆర్థిక కార్యదర్శి బాలనర్సయ్య, నాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

'ఆయుష్మాన్ భారత్' ఓ వరం

ఉమ్మడి జిల్లా సమన్వయకర్త డాక్టర్ నరేష్

వర్గల్(గజ్వేల్): ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ పథకం ప్రజల ఆరోగ్యానికి వరమని ఆరోగ్యశ్రీ ఉమ్మడి మెదక్‌జిల్లా సమన్వయకర్త డాక్టర్ నరేశ్, ఆరోగ్యమిత్ర గౌరారం స్వామి పేర్కొన్నారు. సోమవారం వర్గల్‌లో గ్రామస్తులకు ఆ పథకంపై అవగాహన కల్పించారు. రేషన్‌కార్డు నెంబర్, ఆధార్‌కార్డుకు ఫోన్ నెంబర్ లింక్ కలిగిన వారు ఆయుష్మాన్ భారత్ కార్డుకోసం ఆరోగ్యమిత్రల ద్వారా ఈ-కేవైసీ చేసుకోవాలన్నారు. ఈ కార్డుతో రూ.5లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం లభిస్తుందని వారు చెప్పారు. ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ నరేశ్, టీమ్‌లీడర్ రమేశ్, ఆరోగ్యమిత్ర స్వామి కలిసి ఆరోగ్యస్థితిగతులు తెలుసుకున్నారు. తగు జాగ్రత్తలు సూచించారు.

షాక్ తగిలి రైతు మృతి

దుబ్బాక రూరల్: బోర్ మోటర్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని రాజక్కపేట గ్రామంలో జరిగింది. ఎస్ఐ గంగరాజు కథనం ప్రకారం రైతు పడిగె రాంచంద్రం (77) ఆదివారం సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో పొలం వద్దకు విద్యుత్ మోటర్ ఆన్ చేయడానికి వెళ్లాడు. రాత్రి ఐనప్పటికి ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. అయినా స్పందన లేక పోవడంతో అనుమానం వచ్చి రాత్రి ఏడున్నర సమయంలో తల్లి, కుమారుడు పొలం వద్దకు వెళ్లి చూశారు. రాంచంద్రం అక్కడ పడిఉండడం చూసి కన్నీరుమున్నీరయ్యారు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి మృత దేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

సిద్దిపేటకమాన్: తన భార్య మృతిని తట్టుకోలేక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ రవికుమార్ కథనం ప్రకార.. శ్రీనగర్ కాలనీకి చెందిన ఎన్.బాలయ్యగౌడ్(63) తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. బాలయ్య భార్య అనారోగ్యంతో సంవత్సరం క్రితం మృతి చెందింది. దీంతో బాలయ్యగౌడ్ అప్పటి నుంచి మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం గుర్తించి కుమారుడు లక్ష్మణ్ ఫిర్యాదు చేయ గా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాట్రియాలలో...

రామాయంపేట(మెదక్): గ్రామానికి చెందిన గడ్డం యాదగిరి(30) వ్యవసాయం చేసుకుంటూ తన కటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన కొంత కాలంగా కుటుంబ సమస్యలతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో యాదగిరి రాత్రి ఇంటిలో ఉరి వేసుకొని మృతి చెందాడు. యాదగిరికి భార్యతోపాటు ఆరు నెలల కూతురున్నారు. ఎస్ఐ రంజిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


యాదగిరి (ఫైల్)

భూములను లాక్కున్నారని...

- పల్లె ప్రకృతివనం ప్రహరీ కూల్చిన దళితులు


ప్రహరీ కూల్చివేస్తున్న దళిత మహిళలు

మద్దూరు(హుస్నాబాద్): అభివృద్ధి పేరిట తమ భూములను గుంజుకున్నారని నిరసిస్తూ దళిత మహిళలు పల్లె ప్రకృతి వనం ప్రహరీ కూల్చివేశారు. ఈ ఘటన మద్దూరు మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పంచాయతీ కార్యదర్శి భాస్కర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా గొడను కూల్చిన వారిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులకు దళిత మహిళలకు వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం పలువురు దళిత మహిళలు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం నివాస గృహాలకు ఇచ్చిన స్థలాన్ని పార్కు కోసం ఇవ్వాలని అడగడంతో ఇచ్చేది లేదని స్పష్టం చేశామని, ప్రత్యామ్నాయంగా మరో చోట స్థలం అందిస్తామని స్థానిక నాయకులు, అధికారులు ఒత్తిడి చేయడంతో పార్కుకు స్థలాన్ని ఇచ్చామన్నారు. పల్లె ప్రకృతి వనం నిర్మించి మూడేళ్లు గడుస్తున్నా తమకు ఇప్పటి వరకు ఎలాంటి స్థలం చూపించలేదన్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించి తమ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. తమపై కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తమ స్థలం తమకు వచ్చే వరకూ పోరాటం చేస్తామన్నారు. కార్యదర్శి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ షేక్ యూనుస్ అహ్మద్ అలీ తెలిపారు.

కారు ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

నర్సాపూర్‌రూరల్: ట్రాలీ ఆటోను ముందు నుంచి ఒకకారు వెనక నుంచి మరో కారు ఢీ కొనడంతో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన రెడ్డిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. కౌడిపల్లి మండలం కొత్త చెరువు తండాకు చెందిన గుగ్లోత్ రాములు(37) ట్రాలీఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నర్సాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న తన కుమార్తెను చూసేందుకు ఆదివారం ట్రాలీఆటోలో బయల్దేరాడు. ఈ క్రమంలో నర్సాపూర్ రెడ్డిపల్లి వద్దకు రాగానే మెదక్ నుంచి ఒక కారు వెనక నుంచి ఢీకొట్టగా నర్సాపూర్‌వైపు నుంచి వస్తున్న మరో కారు ముందు నుంచి ఢీకొట్టాయి. ప్రమాదంలో రాములుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు నర్సాపూర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డ్యూటీ డాక్టర్ నిర్ధారించారు. దీంతో రాములు భార్య కోమ్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం


నర్సాపూర్‌రూరల్: కుటుంబ సమస్యలతో గొడవపడిన భార్య కనిపించకుండా పోయిన ఘటన సోమవారం నర్సాపూర్ మండలం గంగారాం తండాలో చోటు చేసుకుంది. కనిపించకుండా పోయిన గృహిణి తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన జర్పుల బుజ్జి కుమార్తె శివానిని సలాబత్ తండాకు చెందిన చంద్రకాంత్‌కు ఇచ్చి నాలుగేళ్ల క్రితం పెళ్లి చేశారు. భర్తతో కుటుంబ సమస్యలపై గొడవ పడిన శివాని తల్లి గారింటి వద్దనే ఉంటుంది. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయిందని శివాని తల్లి బుజ్జి పోలీసులకు ఫిర్యాదు చేశారు.


శివాని(ఫైల్)

ఎన్నికల కోసమే.. పసుపు బోర్డు ప్రకటన

- గ్యారంటీలేని హామీలు ఇచ్చింది బీఆర్ఎస్
- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్లలో ఏర్పాటు చేయని పసుపు బోర్డు ప్రకటన ఇప్పుడు చేస్తుంటే ఎన్నికల కోసమేనని, రైతులు హేళన చేస్తున్నారని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విభజన హామీలో భాగంగా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు కేంద్రం ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదని బీఆర్ఎస్ పార్టీ, తెలంగాణ ప్రభుత్వం స్థలం కేటాయించడం లేదని బీజేపీ పరస్పరం విమర్శించుకుంటున్నాయని ఆరోపించారు. విద్యా సంవత్సరం పూర్తయ్యాక యూనివర్సిటీ ప్రకటన చేశారని, అలాగే రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు భ్రమింపజేస్తున్నారన్నారు. గ్యారెంటీలేని హామీలు ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీయే అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేశామని, అమలు కానివి ఉంటే చర్చకు సిద్ధమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న ఆరు గ్యారెంటీలకు వస్తున్న స్పందన చూసి జీర్ణించుకోలేక కేటీఆర్ గ్యారంటీలేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డీసీసీ కార్యదర్శులు రవీందర్, ఎండీ హస్సెన్, యాదవరెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్